వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 354 మంగళవారం | 20 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



7 లో..

## పనిమంతుడు.. గొట్టిముక్కుల సదానందం

- ఆయన జీవితం ఆదర్శప్రాయం
- వృత్తిరీత్యా.. వ్యక్తిగతంగా ఆయనకు ఆయనే సాటి
- స్వయంకృషితో ఎదిగిన వైనం..
- సేవలకు గుర్తింపుగా వరించిన పురస్కారాలు
- పేదల పక్షపాతిగా గుర్తింపు



## 65వ జన్మదినోత్సవ శుభాకాంక్షలు..

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ముఖ్య నాయకుడు, డబ్ల్యూ పీసీ పాలక మండలి సభ్యుడు, శాయంపేట మండల ప్రజా పరిషత్ పూర్వ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేత బాసాని చంద్రప్రకాష్‌కి 65వ జన్మదిన శుభాకాంక్షలు. శత సంవత్సరాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ..

– ఇట్లు: వరంగల్ వాయిస్ యాజమాన్యం



8లో

## కొత్త కొండలో అఘోర రుద్ర పాశుపత హోమం

పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్




# స్థానికం మరింత ఆలస్యం

వివరాలు 2లో..

- కులగణన ఇప్పట్లో అయ్యే పనేనా..?
- మంత్రి పొన్నం ప్రకటనతో అయోమయం
- ఇప్పటికే గ్రామ పంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం ముగిసి ఏడు నెలలు
- జూన్‌లోనే ఎన్నికలు నిర్వహిస్తామంటూ గతంలో సీఎం ప్రకటన
- రిజర్వేషన్ల ఖరారుపై మొదలు కాని ప్రక్రియ

'స్థానిక' ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. లోక్ సభ ఎన్నికలు ముగిశాక జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామంటూ గతంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినా ఆ దిశగా అడుగులు పడడంలేదు. జనవరి చివరిలోనే గ్రామ పంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం ముగియగా, జూలై మొదటి వారంలో జిల్లా, మండల పరిషత్‌ల కాలపరిమితి ముగిసింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ప్రకటన అయోమయానికి గురిచేస్తోంది. శాసనసభ వేదికగా కులగణనకు కేబినెట్ ఆమోదించిన నేపథ్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను కుల గణన చేసిన తర్వాత వాటి రిజర్వేషన్ల ప్రాతిపదికనే నిర్వహిస్తామంటూ మంత్రి ప్రకటించడం ఆందోళన కలిగిస్తోంది. జనాభా గణన సుదీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉన్నందున స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీల్లో గత ఏడు నెలలుగా కొనసాగుతున్న స్పెషల్ ఆఫీసర్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కుల గణన పూర్తి కావాలంటే కనీసం ఐదు నుంచి ఆరు నెలల సమయమైనా పడుతుందని, అప్పటి వరకు స్పెషల్ పాలన కొనసాగితే జీపీలు మురికి కూపాలుగా మారే అవకాశం ఉందని స్థానిక ప్రజా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్



8లో

## టీఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా వల్లకాటి రాజ్ కుమార్

- 13401 ఓట్ల మెజారిటీతో ఘన విజయం
- పలువురు ప్రముఖుల హర్షం

## మహిళా మంత్రుల డుమ్మా..

- గైర్హాజరు వెనుక అసలు రహస్యం ఏమిటి
- గతంలో మహిళా మంత్రిని శంకుస్థాపనకు ఆహ్వానించకపోవడమా..?
- ప్రోటోకాల్ పాటించకపోవడమా..?

2లో..

# 'స్థానికం' మరింత ఆలస్యం



**కులగణన ఇప్పట్లో అయ్యే పనేనా..?**

**మంత్రి పొన్నం ప్రకటనతో అయోమయం**

**ఇప్పటికే గ్రామ పంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం ముగిసి ఏడు నెలలు**

**జూన్ లోనే ఎన్నికలు నిర్వహిస్తామంటూ గతంలో సీఎం ప్రకటన**

**రిజర్వేషన్ల ఖరారుపై మొదలు కాని ప్రక్రియ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. ఒక్కో అధికారికి మూడు, నాలుగు పంచాయతీల బాధ్యతలను అప్పగించడంతో వారికి పనిభారం పెరిగి పనులు కుంటుపడిపోతున్నాయి. వారు చుట్టపు చూపుగా గ్రామాలకు రావడంతో పంచాయతీల పాలన అస్తవ్యస్థంగా మారిపోయింది. మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు, చేతిపంపులు మరమ్మతులకు కూడా పైసలు లేకపోవడంతో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య జఠిలంగా మారుతోంది. పారిశుధ్యంపై పర్యవేక్షణ కొరవడడంతో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. డెంగీ, మలేరియాతో గ్రామాలు మంచం పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా సీజనల్ వ్యాధులు వేధిస్తున్నాయి.

### మంత్రి ప్రకటన..

శాసన సభ వేదికగా కులగణనకు రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసి జీవో జారీ చేసింది.. ఇందుకోసం ప్రభుత్వం రూ.150కోట్లు కూడా కేటాయించింది..ప్రజా ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగానే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కులగణన చేసిన తర్వాతనే నిర్వహిస్తామంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ప్రకటన దుమారం లేపుతోంది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి కులగణనపై పలు మార్లు రివ్యూ చేశారని, త్వరలోనే కుల గణనపై ప్రభుత్వ చర్యలు పట్టాలెక్కనుందని మంత్రి ప్రకటించారు.

### మరింత ఆలస్యం..

అయితే మంత్రి చెబుతున్నట్లుగా కుల గణన ఇప్పట్లో పూర్తయ్యే పనిగా కనిపించడం లేదు. అది సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఇప్పటికే గ్రామ పంచాయతీల పాలక మండళ్ల పదవీకం కాలం ముగిసి ఏడు నెలలు కావస్తుండగా, జిల్లా, మండల పరిషత్ ల కాలపరిమితి ముగిసి నెల పదిహేను రోజులు కావస్తోంది. అయినప్పటికీ పంచాయతీ ఎన్నికల ప్రక్రియనే మొదలు పెట్టలేదు.



కులగణన కార్యక్రమాన్ని ఏ ఏజెన్సీ లేదా డిపార్ట్ మెంట్ తో చేయించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఇప్పటికీ తీసుకోలేదు. దీనిపై చర్చ మాత్రమే జరుగుతోంది. ఇలాంటి పరిస్థితిలో గ్రామ పంచాయతీల ఎన్నికలు జరిగేందుకు మరో ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని రాజకీయ పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు.

### జాబితాలు సిద్ధం చేస్తున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో గతంలో పంచాయతీ ఎన్నికలకు 2019 జనవరి ఒకటో తేదీన నోటిఫికేషన్ ఇచ్చి జనవరి 21,25,30 తేదీల్లో ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి ఒకటో తేదీన అన్ని పంచాయతీల్లో కొత్తపాలక వర్గాలు కొలువుదీరాయి. దీని ప్రకారం ఫిబ్రవరి నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కాని వివిధ కారణాలతో ఎన్నికలకు వాయిదా వేస్తూ వచ్చారు.

ఇప్పుడు కుల గణన సాకుగా ఎన్నికల వాయిదాకు ప్రయత్నిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండి ఉంటే కులగణనపై ఇప్పటికే ముందస్తు అడుగులు పడేవంటున్నారు.

### 1,688 జీపీలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,688 గ్రామ పంచాయతీలున్నాయి. 2018లో ఉమ్మడి జిల్లాలో 1,060 పంచాయతీలు మాత్రమే ఉండేవి. కేసీఆర్ ప్రభుత్వం 500 జనాభాకన్నా మించి ఉన్న తండాలను కూడా పంచాయతీలుగా అప్ గ్రేడ్ చేయడంతో వాటి సంఖ్య 1,688 కి పెరిగింది. ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో 208, వరంగల్ జిల్లాలో 323, జనగామ జిల్లాలో 281, మహబూబాబాద్ జిల్లాలో 461, ములుగు జిల్లాలో 174, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 241 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో మొత్తం 83 మేజర్ గ్రామ పంచాయతీలున్నాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల పనర్విభజన ఫలితంగా వాటి పరిధిలో అంతకుముందున్న గ్రామ పంచాయతీల సంఖ్యలో మార్పులు జరిగింది. హనుమకొండ జిల్లాలో జీపీల సంఖ్య పెరగ్గా వరంగల్ జిల్లాలో తగ్గాయి.

### బీసీల రిజర్వేషన్లు పెంపు!

పదేళ్ల పాటు పంచాయతీల్లో రిజర్వేషన్లు ఉండే విధంగా పంచాయతీరాజ్ చట్టం-2018 రూపొందించారు. ఇప్పటికి అయిదేళ్లు ముగియడంతో మరో అయిదేళ్ల పాటు పాత రిజర్వేషన్లే కొనసాగే అవకాశం ఉంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ వర్గాల వారికి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంచుతామంటూ ఎన్నికల హామీగా ఇచ్చారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ ఎన్నికల్లో ప్రకటించారు. అలాగే పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో రిజర్వేషన్లలో మార్పులు చేయడం అనివార్యంగా మారింది.

# మహిళా మంత్రుల డుమ్మా..

**గైర్హాజరు వెనుక అసలు రహస్యం ఏమిటి**

**గతంలో మహిళా మంత్రిని శంకుస్థాపనకు ఆహ్వానించకపోవడమా..?**

**ప్రోటోకాల్ పాటించకపోవడమా..?**

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** భూపాలపల్లి నియోజకవర్గంలో పర్యాటక అభివృద్ధి-అధ్యాయనంలో భాగంగా మంగళవారం రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావుతోపాటు మహిళా మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూర్య (సీతక్క) పర్యటించాల్సి ఉన్నప్పటికీ మహిళా మంత్రులిద్దరూ డుమ్మా కొట్టడం చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుండే ఇద్దరు మహిళా మంత్రులు భూపాలపల్లిలో జరిగిన పర్యటనలో పాల్గొనకపోవడంలో దాగి ఉన్న అసలు రహస్యం ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో వీరికి జరిగిన అవమానాల కారణంగానే అధికారిక కార్యక్రమాలు డుమ్మా కొట్టారన్న ప్రచారం సాగుతోంది. ఈ నెల 3న జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని మైలారం గ్రామంలో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపనకు ఉమ్మడి జిల్లాలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆహ్వానించకపోవడంతో పాటు ఫ్లెక్సీల్లో సైతం ఆమె ఫొటోను ముద్రించికపోవడం ఒక కారణమైతే..ఉమ్మడి జిల్లాకు చెందిన మరో మహిళా మంత్రి సీతక్కను అదే కార్యక్రమానికి ఆహ్వానించి ఫ్లెక్సీల్లో ప్రోటోకాల్ పాటించకుండా..తన ఫొటోను చిన్నదిగా చేసి..ముద్రించడాన్ని జీర్ణించుకోలేని ఈ ఇద్దరు మంత్రుల అభిమానులు, ఆయా సామాజిక వర్గాల ప్రజలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల మేధావులు అప్పట్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ఈ అవమానకరమైన సంఘటనను ఇద్దరు మంత్రులు దృష్టిలో పెట్టుకొని..వారి అభిమానుల కోరిక మేరకు మంగళవారం క్షేత్రస్థాయిలో జరిగే అభివృద్ధి పనుల పరిశీలనకు, వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు రాలేదన్న ప్రచారం నియోజకవర్గంలో గుప్పుమంటోంది. మహిళా మంత్రులను పిలవకుండా ఒకరిని, పిలిచి మరొకరిని అవమానించేలా చేసినందుకే వారు మనస్థాపం చెంది ఉంటారని ఈ పర్యటనలకు దూరం అవడానికి కారణం అదే కావచ్చనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మహిళా మంత్రులు మనస్థాపం చందేందుకు కారకులైన సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని భూపాలపల్లిలోని మహిళలోకం డిమాండ్ చేస్తోంది. అదేవిధంగా ఇప్పటికైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, భూపాలపల్లి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే, అందరి మంత్రుల ఆశీస్సులు భూపాలపల్లి నియోజకవర్గంపై ఉండేలా స్థానిక శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. ఇలాంటి పొరపాట్లు మళ్లీ జరగకుండా చూసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా మంగళవారం వరంగల్ ఎంజీఎం సెంటర్ లోని ఆయన నిలువెత్తు విగ్రహానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ కడియం కావ్యతోపాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, పుల్లా పద్మావతి, పుల్లా భాస్కర్, గుండేటి నరేంద్ర కుమార్, తత్తరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా కాంగ్రెస్ భవన్‌లో..

రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ భవన్ లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాటారం బంద్ విజయవంతం



**వరంగల్ వాయిస్, కాటారం :** బంగ్లాదేశ్ లో హిందువులపై దాడి, హిందూ దేవాలయం ధ్వంసం ఘటనలకు నిరసనగా మంగళవారం కాటారం మండలం బంద్ కు అఖిలపక్షం పిలుపునిచ్చింది. భారతీయ జనతా పార్టీ, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, హిందూ సంఘాల ఐక్యవేదిక, అఖిల పక్ష కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం బంద్ కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కాటారం మండల కేంద్రంలోని దుకాణాలు, పండ్ల దుకాణాలు, బట్టల దుకాణాలు కిరాణా దుకాణాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, బంద్ లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ నాయకులు మల్లారెడ్డి, బొమ్మన భాస్కర్ రెడ్డి, దుర్గం తిరుపతి, బొంతల రవి, గోగుల రాజేష్, బొడ్డు ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

# హైటెక్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంజూర్ నగర్ హైటెక్ కాలనీలో నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సోమవారం ఎన్నికలు కార్యక్రమం నిర్వహించి నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సామల లక్ష్మారెడ్డి, అధ్యక్షుడు తూడి భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు: కుప్పాల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పిన్నింటి శ్రీనివాసరావు, కోశాధికారి బొమ్మకంటి పవన్ కుమార్, పసునూటి సుమన్, కార్యదర్శులు పున్నమినేని శ్రీనివాసరావు, సట్లసురేష్, పంచనేని రామారావు, సలహాదారులు గొల్ల శ్రీనివాస్, ఆరేపల్లి ఓదేలు, సహాయ కార్యదర్శులు చల్లా రవీందర్ రెడ్డి, పైతారి మహేష్, గోపతి రాజులు ఎన్నికయ్యారు.

# నిత్యావసర సరుకుల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి కరుకాల వెంకట్ రెడ్డి సహకారంతో వరంగల్ లోని లూయిస్ ఆదర్శ అంధుల, దివ్యాంగుల ఆశ్రమంలో పిల్లలకు సౌకర్యార్థం బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు, బ్రెయిలీ పేపర్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అని అన్నారు. వీరికి అందరికి ఉన్న హక్కులు ఉంటాయని, వారిని హేళన చేసిన ఇబ్బంది పెట్టినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని అన్నారు. వీరికి ప్రేమ ఆప్యాయతలు పంచి ప్రోత్సహించాలని, వీరికి చూపులేక పోయినా దివ్య దృష్టితో చూడగలరని, వీరికి ఓపికతో నేర్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ తోచిన మేర సహాయసహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కళ్యాణి, సుష్మ, కరకాల ఆర్విక, టీచర్స్, పిల్లలు, సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

## అధికారులకు సూచించిన మంత్రి పొంగులేటి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** భారీ వర్షాల నేపథ్యంలో వచ్చే ఐదు రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రెవెన్యూ యాక్ట్ పై జిల్లాలోని మేధావులు, సీనియర్ సిటిజన్స్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరించాలని, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ఎల్ఆర్ఎస్, ధరణి దరఖాస్తు లను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం హైదరాబాద్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరం నుంచి అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) రెవెన్యూ లెనిన్ వత్సల్ టోప్పో, ఎం.డేవిడ్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వచ్చే ఐదు రోజులు మరింత వర్షాలు పడే అవకాశం ఉన్నందున కలెక్టర్లు జిల్లా స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణనష్టం, ఆస్తి నష్టం కలగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు, పాఠశాలలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే రెవెన్యూ యాక్ట్ పై రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో 23 లేదా 24 తేదీలలో జిల్లా స్థాయిలలో మేధావులు, సీనియర్ సిటిజన్స్, సీనియర్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్, ధరణి దరఖాస్తులు అధిక శాతం పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిశీలించి అర్హత గల దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఆమోదించాలన్నారు. ప్రత్యేక బృందాలను నియమించి రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, సంబంధిత సిబ్బంది ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించి సరైన వాటిని పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, ఎల్ఆర్ఎస్ లకు సంబంధించి జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని మంత్రి కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మహబూబాబాద్, తొర్రూర్, ఆర్డీఓలు అలివేలు, నరసింహారావు, డీపీఓ హరిప్రసాద్, ఆర్అండ్ బీ ఈఈ బీమ్లా నాయక్, తహసీల్దార్స్ భద్రకాళి, భగవాన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రుణమాఫీ అంతా డొల్ల..

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్రంలో రుణమాఫీ అంతా డొల్ల అని..రైతులను మోసం చేయడం కాంగ్రెస్ కు కొత్త కాదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గ్రామ స్థాయిలో రుణాలు మాఫీ కాని రైతుల వివరాలు సేకరించి కలెక్టర్లకు, రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శికి అందజేస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో రుణమాఫీకి 47 లక్షల మంది రైతులకు రుణమాఫీ కావాలని ఎస్ఎల్బీసీ చెప్పింది. రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్లు అవసరమవుతుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. రూ.31వేల కోట్లు అంటూ కేబినెట్ ఆమోదించిందని.. రూ.26 వేల కోట్లంటూ బడ్జెట్ ఆమోదించిందని.. చివరకు రూ.17వేల కోట్లతో రుణమాఫీ అన్నారన్నారు. కేవలం 22లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేసి వంద శాతం చేశామని మరోసారి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 25 లక్షల మంది రైతులకు ఎగనామం పెట్టి మోసం చేశారని మండిపడ్డారు. కనీసం 40శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. గ్రామ స్థాయిలో రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరిస్తామని, వివరాలను జిల్లా కలెక్టర్లకు, రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శికి అందజేస్తామని అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు గ్రామ, మండల స్థాయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు ఈనెల 21 నుంచి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రుణమాఫీ కానీ రైతుల వివరాలు సేకరించాలని కోరారు.

# లిటిల్ ఫ్లవర్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలి




**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో అధిక ఫీజులను వసూలు చేస్తూ విద్యను వ్యాపారం చేస్తున్న లిటిల్ ఫ్లవర్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్ డిమాండ్ చేశారు. పరకాల పట్టణంలో ఉన్న లిటిల్ ఫ్లవర్ స్కూల్ ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ కనీసం ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదని, ఇరుకు గదుల్లో రేకుల షెడ్లలో తరగతులు నిర్వహించడం, పుస్తకాలు, మెటీరియల్స్ యూనిఫామ్ స్కూల్ లోనే అమ్మడం, ఈ పేర్లతో అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. పాఠశాలకు కనీసం గ్రౌండ్ సౌకర్యం లేదని, గతంలో విద్యాశాఖ అధికారులకు చాలాసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. విద్యార్థులకు కనీస టాయిలెట్ సౌకర్యాలు లేవని, ఎన్నో ఆశలు కల్పించి అడ్మిషన్లు తీసుకుని మోసం చేస్తున్నారని, స్కూలు వ్యాన్లలో విద్యార్థులను పరిమితికి మించి తీసుకువెళ్తున్నారని, ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి లిటిల్ ఫ్లవర్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ప్రశాంత్ డిమాండ్ చేశారు. సిద్ధు, శివ, సాయి, మహేష్, హేమంత్, భరణి, వరుణ్, శివ పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్




**వరంగల్ వాయిస్, గార్ల :** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మంగళవారం ఉదయం గార్ల పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది విధులను పరిశీలించారు. మొదటగా స్టేషన్ పరిసరాలను పూర్తిగా పరిశీలించి సిబ్బంది పరిశుభ్రతపై మరింత శ్రద్ధను వహించాలని సూచించారు. వివిధ కేసులలో సీజ్ చేయబడిన వాహనాలు, ఇతర ప్రాపర్టీని వీలైనంత త్వరగా తొలగించి పోలీస్ స్టేషన్ ఆవరణ, పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సెంటర్ ను, స్టేషన్ లో ఉన్న పెండింగ్ కేసుల వివరాలను, సిబ్బంది విధుల వివరాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. స్టేషన్ కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను పరిష్కరిస్తూ న్యాయం చేకూర్చే విధంగా విధులను నిర్వర్తించాలని తెలిపారు. రికార్డులను, కేసులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎటువంటి పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. స్టేషన్ సిబ్బంది డయల్ 100పై ప్రత్యేక దృష్టి సారిస్తూ సంఘటన స్థలాలకు వీలైనంత త్వరగా చేరుకుని సమస్యను పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బారిన పడకుండా గ్రామాలను సందర్శిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా సైబర్ క్రైమ్ పై ప్రత్యేక దృష్టిసారిస్తూ బాధితుల నష్ట పరిహారాన్ని త్వరగా వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధులు గురించి అడిగి తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, గార్ల, బయ్యారం సీఐ రవి, డీసీఆర్ బీ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ జీనాథ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమాచార విప్లవ పితామహుడు రాజీవ్ గాంధీ

## ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా ఆధ్వర్యంలో మంగళవారం భారత రత్న, దివంగత ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ విచ్చేసి కేట్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఐరన్ లేడీ అఫ్ ఇండియా దివంగత ప్రధాన మంత్రి స్వర్గీయ ఇందిరమ్మ కుమారుడు రాజీవ్ గాంధీ 1984 అక్టోబర్ 31న తల్లి మరణంతో ఉత్తర ప్రదేశ్ అమేథి లోక్ సభ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 1981లో పోటీ చేసి ఎన్నికయ్యారని తెలిపారు. తల్లి మరణంతో కాంగ్రెస్ పార్టీ తన భుజస్కంధాలపై వేసుకొని 1984లో దేశ భవిష్యత్తు కోసం 40 సంవత్సరాల వయసులోనే భారతదేశ ప్రధానమంత్రిగా అతిపిన్న వయస్కుడిగా చరిత్రలోకెక్కారు. తదుపరి ఎన్నికలలో అత్యధిక స్థానాలతో మెజారిటీని సాధించి రెండవ సారి ప్రధానమంత్రి అయ్యారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఆధునీకరణ, ఉదారీకరణపై దృష్టి సారించింది. మొదటిసారిగా కంప్యూటర్లు, టెలి కమ్యూనికేషన్ వంటి రంగాలలో ఆయన అనేక ముఖ్యమైన సంస్కరణలు ప్రవేశపెట్టాడు. ఆయనను భారత దేశంలో సమాచార విప్లవ పితామహుడిగా పరిగణిస్తారు. దేశంలో కంప్యూటరైజేషన్ , టెలి కమ్యూనికేషన్ విప్లవం ఆయనకే చెందుతుందని, స్థానిక స్వపరిపాలన సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేసిన ఘనత ఆయనకే చెందుతుందన్నారు. 1991లో మే 21న రాజీవ్ గాంధీ తమిళనాడులో పేరంబుదుంబూరులో ఎన్నికల ప్రచారంలో ఉండగా బాంబు దాడిలో మరణించారు. దేశం కోసం ప్రాణాలిచ్చిన కుటుంబ ఒక్క గాంధీ కుటుంబం మాత్రమేనని రాజీవ్ కు ఘనంగా నివాళులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ రవి చందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్ రెడ్డి, జడ్పీటీసీ నామకారం చంద్ గాంధీ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లు నల్లెల భారత్, బండి శ్రీను వారితో పాటు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల్ నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీకి ఇనగాల నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కుడా చైర్మన్ శ్రీ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వరంగల్ ఎంజీఎం కూడలి వద్ద ఉన్న రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ కావ్య, ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ముఖ్య నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

### తొర్రూరులో..



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలో మంగళవారం మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెదగాని సోమయ్యలు సంయుక్తంగా మాట్లాడారు. దేశం సాంకేతిక అభివృద్ధిలో ముందుకు కొనసాగటానికి రాజీవ్ గాంధీ ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నెల్లికుదురులో..



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** స్థానిక ప్రభుత్వ విశ్రాంతి భవనంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్, తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ జిలకర యాలాద్రి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి కుంట్ల మౌనేందర్, టౌన్ అధ్యక్షులు రత్నపురం యాకయ్య, ఆకుల నరసయ్య, మదనతుర్తి మాజీ సర్పంచ్ వలబోజు వెంకటేశ్వర్లు, మదనతుర్తి మాజీ ఎంపీటీసీ మంగి మల్లయ్య, వస్త్రం తండా గుగులోతు రవి, వర్రె అశోక్, మునిగేలవేడు పార్టీ అధ్యక్షుడు ఇసంపల్లి వెంకటేష్, పయ్యావుల బిక్షం, గుగులోతు లాల్ సింగ్, బోల్లపల్లి సతీష్, ఇస్లావత్ శంకర్. గూగులోతు భిక్షం నాయక్, గూగుతోతు చంద్రు నాయక్, పీఏసీఎస్ శ్రీరామగిరి డైరెక్టర్ మద్దెల సమ్మయ్య, మామిడాల లోకేష్, డాక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### శాయంపేటలో..



**వరంగల్ వాయిస్, శాయంపేట :** నేడు భారతదేశ ప్రజలు అనుభవిస్తున్న సాంకేతికతకు ఆద్యుడు రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టి రెడ్డి రాజిరెడ్డి, మండల అధికార ప్రతినిధి చిందం రవి, మండల నాయకులు వైనాల కుమారస్వామి, హైదర్, మారేపల్లి రవీందర్, రఫీ, భాషని మార్కండేయ, మాదిరెడ్డి ప్రపంచ రెడ్డి, రాజు, మారపల్లి కటయ్య, వీరన్న, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఐటీ రంగానికి పునాదులు వేసిన మహానీయుడు రాజీవ్ గాంధీ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాజీవ్ గాంధీ గారి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ యువతకు స్ఫూర్తి, ఆధునిక భారత కీర్తి, ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి, దేశాన్నిఅనేక రంగాల్లో అభివృద్ధి చేసిన ధృవతార మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని మంత్రి సీతక్క కొనియాడారు.

## శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి ప్రదాత రాజీవ్ గాంధీ



**వరంగల్ వాయిస్, కేయూ :** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం కేయూ మొదటి గేట్ వద్ద తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మేడారపు సుధాకర్ అధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మేడారపు సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి నరేష్ లు మాట్లాడుతూ ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి దేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు, 18 ఏళ్ల యువతకు ఓటు హక్కు కల్పించిన మహనీయులు మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి నరేష్, గుండేటి సుమన్, శ్రీనివాస్, రాంబాబు, రాంచందర్, దయాకర్, అరుణ్ కుమార్, విఘ్నేష్, నరేందర్, మూర్తిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

### పోస్టాఫీస్ జంక్షన్‌లో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పోస్టాఫీస్ జంక్షన్ లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశ ప్రధానిగాచేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, గుల్లపల్లి రామకృష్ణ, దౌడు నాగరాజ్, కొగిల యాకూబ్, కొత్తకొండ శ్రీనివాస్, కొత్తకొండ రవి, ఓడపల్లి రవి, శ్యామల మార్క్, సలీం, శ్రీకాంత్, గంగయ్య, చిన్నపెల్లి విజయ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు గూడ శారద, పొడిశెట్టి సరళా దేవి, గూడ లావణ్య, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

### రంగశాయిపేటలో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రంగశాయిపేట ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ యువజన పురస్కార గ్రహీత మండల పరశురాములు హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. మండల పరశురాములు మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ శర్వాణి రాజీవ్ గాంధీ దేశానికి చేసిన మహత్తర సేవలను వివరించారు. ఈ సందర్భంగా, పండ్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ ఆర్గనైజర్ సుజాత, వైద్య సిబ్బంది విజయలక్ష్మి, విజయ, భాగ్యలక్ష్మి, జయమణి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### పర్వతిగిరిలో..



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోని మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు రాజీవ్ గాంధీ ఈ భారతదేశానికి ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల, జిల్లా , గ్రామ స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ప్రావీణ్యను కలిసిన టీఎన్జీఓస్ నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు కలెక్టర్ పి.ప్రావీణ్య ను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు కష్టపడి పనిచేసి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళా ఉద్యోగులకు ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణు గోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, ఉమెన్స్ వింగ్ కన్వీనర్ రాజ్యలక్ష్మి, కేంద్ర సంఘం నేతలు శ్యామ్ సుందర్, సారంగపాణి, లక్ష్మి ప్రసాద్, జిల్లా నేతలు రాజేష్ ఖన్నా, ఎర్ర ప్రగడ, పృథ్వీ, ప్రణయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీని కలిసిన ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన ఇన్ స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా మడికొండ పోలీస్ స్టేషన్ నూతన ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన పుల్యాల కిషన్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, నిజాయితీతో విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ నూతన ఇన్ స్పెక్టర్ కు సూచించారు.

## త్రిపుర గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి మండలం కల్లెడ ఆర్డీఎఫ్ కళాశాలలో బుధవారం ఉపాధ్యాయుల నివాస సముదాయాన్ని, వృత్తి విద్యా కోర్సులను ప్రారంభించడానికి త్రిపుర గవర్నర్ ఇంద్ర సేనా రెడ్డి రానున్న సందర్భంగా ఏర్పాట్లను ఆర్డీఎఫ్ వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రామ్మోహన్ రావు, స్థానిక ఎస్సై ప్రవీణ్ కుమార్ పరిశీలించారు.

## భద్రు భుక్యాకు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ పరిశోధకుడు భద్రు భుక్యాకు విశ్వవిద్యాలయ ఇంచార్జి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య మహమ్మద్ ముస్తఫా డాక్టరేటే ప్రకటించారు. డాక్టర్ భద్రు భుక్యా "స్టడీస్ ఆన్ సింతేసిస్ అండ్ బయాలజికల్ ఆక్టివిటీస్ అఫ్ నోవెల్ ఫ్యూసుడ్ పైరిడిన్ హేతేరోసైకిల్స్ అండ్ డెవలప్మెంట్ అఫ్ న్యూ సింతేటిక్ మెథడాలజీస్ " అనే అంశంపై విభాగ ఆచార్యులు ఆచార్య జి.హనుమంతు పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. కొంకపాక గ్రామం, పర్వతగిరి మండలం, వరంగల్ జిల్లాకు చెందిన డాక్టర్ భద్రు భుక్యా ప్రస్తుతం నర్సంపేట్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రసాయన శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ భద్రు భుక్యాను అభినందించారు.

# తరతరాల అణచివేతను ఎదురించాలి

### ఐఎల్పీఏ నాయకులు సాయిని నరేందర్

### జనగామ బార్‌లో పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, జనగామ :** సమాజ హితం కోసం తరతరాలుగా సేవ చేస్తున్న బీసీలను ఈ దేశ పాలకులు అన్ని రంగాల్లో అణచివేస్తున్నారని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు సాయిని నరేందర్ అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ లో జనగామ బార్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రఋషి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన సదస్సు వాల్ పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. బీసీ సమస్యలపై ఈ నెల 25 న హైదరాబాద్ లోని జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ ఆడిటోరియం లో జరుగు ఓబీసీ న్యాయవాదుల రాష్ట్ర సదస్సులో న్యాయవాదులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ కోసం తెలంగాణ న్యాయవాదులు పోరాటం చేసినట్లుగా బీసీల విముక్తి కోసం బీసీ న్యాయవాదులు పోరాడాలని పిలుపునిచ్చారు. సకల సామాజిక రంగాల్లో ఎవరెంతమందో వారికంత వాటా కోసం జరిగే పోరాటంలో న్యాయవాదులు ముందుండాలన్నారు.బార్ అసోసియేన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రఋషి మాట్లాడుతూ బీసీ సమాజాన్ని చైతన్యం చేసి హక్కుల సాధన కోసం దేశంలోనే మొదటి సారి జరుగుతున్న ఓబీసీ న్యాయవాదుల సదస్సుకు న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎల్ పీఏ రాష్ట్ర నాయకులు మాధవకృష్ణ, సిక్కుల్ల భిక్షమయ్య, పూస మల్లేష్, జనగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్ర రుషి, ప్రధాన కార్యదర్శి నక్క సిద్ధులు యాదవ్, ఉపాధ్యక్షులు బాలకిషన్ గౌడ్, కోశాధికారి చెరుకు చంద్రశేఖర్, క్రీడా కార్యదర్శి పసునూరి మురళి, ఈసీ మెంబర్ మధుసూదన్, న్యాయవాదులు మంచాల రవీందర్, గాజుల రవీందర్, సిద్ధిరాములు, హరీష్, స్వప్న, జ్యోత్స్న, ఉమాదేవి, నరసింహ, రవికుమార్, ముజీబ్, పానుగంటి శ్రీనివాస్, కోట శంకర్, రాజశేఖర్, బాలరాజు, నరసింహ, రవి, స్వామి, సుదర్శన్, కవిత, రేణుక, రాధిక, రేఖ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే తత్వంతో శాస్త్రీయ అభిరుచి సాధ్యం

### కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** "ప్రశ్నించే తత్వంతో శాస్త్రీయ అభిరుచి సాధ్యం" అని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ సెమినార్ హాల్ లో విభాగ అధిపతి ఆచార్య టి.సవితా జ్యోత్స్న అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక, హనుమకొండ కమిటీ, కాకతీయ విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగం సంయుక్తంగా నిర్వహించిన "నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే" కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగించారు. భారతీయ శాస్త్ర వేత్తలు నోబెల్ బహుమతికి అర్హులు అని, విద్యార్థి హేతుబద్ధమైన ఆలోచన కలిగి ఉండాలన్నారు. గొప్ప శాస్త్రవేత్తల అనుభవాల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. రోజు వారి దినచర్యలో సైంటిఫిక్ టెంపెర్ ఉందన్నారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గౌరవ అతిథిగా విచేసిన తెలంగాణ జనవిజ్ఞాన వేదిక సెక్రటరీ, విశ్రాంత ఎన్ఐటీ ఆచార్యులు ఆచార్య కే.లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ అభిరుచి కలిగి ఉండటం ప్రతి ఒక్క పౌరుడి డ్యూటీ అని అన్నారు. సమస్యలకు సమాధానం సైన్స్ లో ఉందన్నారు. విజ్ఞానం ద్వారా అబివృద్ధి సాధ్యమని విద్యార్థులలో ఆసక్తి కలుగచేయటం టీచర్లతోనే సాధ్యమన్నారు. విశ్రాంత ఫారెస్ట్ ఆఫీసర్, జన విజ్ఞాన వేదిక హనుమకొండ అధ్యక్షుడు కే.పురుషోత్తం మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్యత కాపాడవలసిన బాధ్యత ప్రతిఒక్కరిదన్నారు. విద్యార్థిలో శాస్త్రీయ దృక్పథం అవసరమన్నారు. పర్యావరణం అంటే ముందు తరాల నుంచి తీసుకున్న అప్పు అని అన్నారు. సైన్సు విభాగల డీన్ ఆచార్య జి.హనుమంత్ మాట్లాడుతూ ఇంకా మూఢనమ్మకాలలో కొట్టుమిట్టాడుతున్నట్టు, వాటి నుంచి బయటపడాలంటే సైన్సు మాత్రమే మార్గమని తెలిపారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్ లాల్ మాట్లాడుతూ శాస్తీయ అభిరుచి పాఠశాల నుంచే ప్రారంభం కావాలన్నారు. ఐడియా ఉంటె సరిపోదు దానిని ఆచరణలో పెట్టాలన్నారు. పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు ఆచార్య ఎస్.జ్యోతి మాట్లాడుతూ ఉత్సుకత ఉన్నప్పుడే శాస్త్రీయ అభిరుచి సాధ్యమని పేర్కొన్నారు. నమ్మాలంటే సాక్ష్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధనా, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులచే పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు.

## కుక్కల బెడదను నియంత్రించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ కు కుక్కల బెడద నియంత్రించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేవైఎం మానుకోట జిల్లా ప్రధాన కార్యదర్శి కాగు నవీన్ మాట్లాడుతూ తొర్రూరు పట్టణంలో రోజురోజుకూ కుక్కల బెడద ఎక్కువైందని, పట్టణంలో ఏ వీధి లో చూసిన ఇరవై నుంచి ముప్పై కుక్కలు గుంపులుగా చేరి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. కుక్కల బెడద నుంచి తొర్రూరు పట్టణ ప్రజలను కాపాడాలని కోరారు. కుక్కల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ను వెంటనే వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ తొర్రూరు అర్బన్ ప్రధాన కార్యదర్శి పైండ్ల రాజేష్, అర్బన్ ఉపాధ్యక్షుడు గట్ల భరత్, అర్బన్ కార్యదర్శులు నడిగడ్డ సందీప్, తాటి జగదీష్, బీజేవైఎం అర్బన్ ఉపాధ్యక్షుడు జాలిగామ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ఒకరికి జైలు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండలంలోని మంగోలి గూడెం గ్రామానికి చెందిన బానోతు బాలాజీ కు తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత 3 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు జరిమానా విధించారని మరిపెడ ఎస్సై బి.సతీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం 2014వ సంవత్సరంలో మంగోలి గూడెంకు చెందిన గాడిపెల్లి నారాయణ తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, 60 వేలు డబ్బు దొంగిలించాడు. బాధితులు మరిపెడ పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇవ్వగా అప్పటి సీఐ కరుణ సాగర్ రెడ్డి కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం కోర్ట్ లో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్ట్ లో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.గణేష్ ఆనంద్, స్వప్నలు వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత బానోతు బాలాజీకి మూడు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు 1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్ట్ కానిస్టేబుల్ రామ్ నారాయణను తొర్రూరు డీఎస్పీ సురేష్, సీఐ రాజు కుమార్ గౌడ్, ఎస్ఐ బి.సతీష్ అభినందించారు.

# వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు కోరారు. మంగళవారం వరంగల్ జిల్లా కమిటీ సమావేశం కందిక చెన్నకేశవులు అధ్యక్షతన జరగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే పార్టీలకు కాలం చెల్లిందన్నారు. లౌకిక దేశమైన భారత దేశంలో ఎన్నటికైనా మత రాజకీయాలు, మతోన్మాద శక్తులు అంతరించిపోక తప్పదన్నారు. కేంద్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పని చేసిందని, పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. దళితుల, గిరిజనుల, మైనారిటీలపై బీజేపీ హయాంలో దాడులు పెరిగాయని, చివరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలను కూడా ధ్వంసం చేశారన్నారు. పార్లమెంటు ఎన్నికలలో బీజేపీని మెజారిటీ ప్రజలు వ్యతిరేకించారని, అయినా మోడీ వైఖరిలో మార్పు రాలేదన్నారు. కమ్యూనిస్టులు, లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ సాధ్యమని అన్నారు. రానున్న రోజులలో పార్టీ బలోపేతానికి సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు కృషి చేయాలని కోరారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత, వెనుకబడిన వరంగల్ జిల్లా నిర్లక్ష్యానికి గురైంది, మరిన్ని నిధులు కేటాయించాలని జిల్లా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఆగష్టు 22, 23, 24 తేదీలలో హనుమకొండలోని హరిత కాకతీయ హెూటల్ లో సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డీ.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, మాజీ ఎంపీ అజీజ్ పాషా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై, దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల విజయవంతానికి కృషి చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంజాల రమేష్, సహాయ కార్యదర్శి ఎస్ కె బాష్మియా, పనస ప్రసాద్ జిల్లా నాయకులు, దండు లక్ష్మణ్, బుస్సా రవీందర్, గన్నారపు రమేష్, గుండే బద్రి, వీరగోని శంకరయ్య, మునీశ్వరుడు, సంగి యెలెందర్, తల్లాపెల్లి రాహెల, జన్ను రవి, ఆరెల్లి రవి, దామెర కృష్ణ, ఓర్సు రాజు, ఎండీ అంజద్, జన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలపై సమీక్ష



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక ఐడీఓసీ కార్యాలయంలో కాజీపేట హాజ్రాత్ సయ్యద్ షా బియబాని దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో నగర్ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పిఠాధిపతి కూసుర్ పాషా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ తానాజీ వాకడే, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ఉత్సవాల ఏర్పాట్లకు విద్యుత్తు శాఖ, నీటి సరఫరా, ఆర్ అండ్ బీ, వైద్య శాఖ, పోలీస్ శాఖ, ట్రాఫిక్ , రైల్వే శాఖ అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు.

## విద్యార్థులకు గణితబోధిని పుస్తకాల అందజేత



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని పోలేపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నాలుగో తరగతి చదువుతున్న సహస్ర అనే విద్యార్థిని పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు పద్మ , నరసయ్య విద్యార్థుల్లో గణిత సామర్థ్యాన్ని పెంచే దిశగా ఉపయోగపడే సుమారు రూ. 2000 విలువ గల గణితబోధిని పుస్తకాలను 50 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విమలాదేవి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎల్లమ్మ, సీఆర్పీ రాధిక, ఉపాధ్యాయులు స్వాతి, బీమా, శ్రీనివాస్, దేవేంద్ర, లచ్చుమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శామంతుల శ్రీనివాస్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గా ఇటీవల న్యాయవాది శామంతుల శ్రీనివాస్ నియమితులైన సందర్భంగా వరంగల్ కొత్తవాడ పద్మశాలి భవన్ లో మంగళవారం వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శాలువా, పుష్పగుచ్చాలతో అభినందించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయాలలో రాణించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం పద్మశాలీలకు, రాష్ట్ర స్థాయిలో అవకాశాలు కల్పించాలని కొరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వోడ్నాల నరేందర్, కార్పొరేటర్ గుండేటి నరేందర్, మాజీ కార్పొరేటర్ ఎలుగం లీలావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంటల రాజు, గోషికొండ సుధాకర్, మాటేటి అశోక్, మెరుగు సుభాష్, దాసరి వెంకటేశ్వర్లు, గంజి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## వికాస్ పాఠశాలలో ఎకో మిత్రపై అవగాహన



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** డివిజన్ కేంద్రంలోని వికాస్ పాఠశాలలో మంగళవారం ఎకో మిత్రపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎకో మిత్రపై అవగాహన కల్పించడానికి పర్యావరణ ప్రేమికులు దారం కుమార స్వామి పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు వినియోగించరాదని, అలాగే ప్లాస్టిక్ బాటిళ్లను ఎలా వాడుకోవాలో వాటికి సంబంధించిన ఫొటోలను విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించారు. అనంతరం చెట్టుకు రాఖీ కట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ గౌడ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్లాస్టిక్ ప్రస్తుతం ఒక భయంకరమైన వస్తువుగా తయారైందని, దాని వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలన్నారు. అనంతరం కుమార స్వామిని సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్, నాగరాజు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మడెలయ్య బోనాలకు ఏర్పాట్లు చేయిస్తా

### కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రజకుల ఆరాధ్య దైవమైన శ్రీ మడెలయ్య స్వామి బోనాల జాతరకు విచ్చేయు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దేవాలయం వద్ద పనులు చేయుటకు తగు చొరవ చూపిస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఉర్సు చెరువు వద్ద గల మడేలయ్య స్వామి గుడి ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి పరిసర ప్రాంతాలలో చెత్తాచెదారంతో నిండి ఉందని, ఆవరణ అంతా ఎగుడు దిగుడుగా ఉందని, ఆ ప్రాంతాన్ని సమాంతరంగా చేయించాలని రజక సంఘం ఆధ్వర్యంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవికి వినతిపత్రం ఇవ్వగా అధికారుల దృష్టికి తీసుకొచ్చి కార్పొరేషన్ ద్వారా పనులు చేపడతామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రజక సంఘం నాయకులు రాముల బాబు, రాముల మల్లేశం, రాముల అయ్యప్ప, రాముల ధ్రువకుమార్, రాముల సాంబమూర్తి, రాముల రాజు, రాముల కృష్ణ తదితరులు ఉన్నారు.

## ఫొటోగ్రాఫర్లను సన్మానించిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫొటోగ్రఫీ పోటీలలో ఉమ్మడి వరంగల్ కు చెందిన వివిధ దినపత్రికల్లో పనిచేస్తున్న ఫొటో జర్నలిస్టులైన గోకరాపు శ్యాం కుమార్, వీరగౌని హరీష్, కుడుతాల రమేష్, చేతి శ్రీనివాస్, మెరుగు ప్రతాప్ లకు అవార్డులు వచ్చిన సందర్భంగా మంగళవారం వారిని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు మెమెంటో అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ సముద్రాల మధు, పాక్స్ చైర్మన్లు మనోజ్ గౌడ్, కుమారస్వామి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



**వరంగల్ వాయిస్, కాటారం :** స్థానిక గ్రామ పంచాయతీ లోని బొమ్మన వాడకు చెందిన కొండ గొర్ల బాబు రెండు రోజుల క్రిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా సోమవారం ఉదయం మరణించాడు. విషయం తెలుసుకొని కాటారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాటారం మాజీ ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్ కుటుంబం సభ్యులను పరామర్శించారు. మృతుడు బాపు ఇద్దరు అమ్మాయిలను ఓదార్చారు. మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఆ ఇద్దరు అమ్మాయిలతో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని పై చదువులు, వైద్యం పరంగా ఆదుకుంటామని పిల్లలకు హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## మిషన్ భగీరథ నీళ్లకు కటకట



**వరంగల్ వాయిస్, కాటారం :** మండలం కేంద్రంలోని కాటారం గ్రామ పంచాయతీలోని ఆదర్శ నగర్ కాలనీలో గతవారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదని కాలనీ వాసులు ఎడ్ల సతీష్, ఆత్మకూరి కుమార్, పెనుకొండ బాపు, పెద్దపల్లి మహేష్ అందరు కలిసి లికేజీ ఉన్న పైపు లైన్ ను పరిశీలించారు. కాటారం గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల సందీప్ దృష్టికి తీసుకువెళ్తే వారు ఇద్దరు వచ్చి వాటర్ లికేజీ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మిషన్ భగీరథ ఏఈ రాజశేఖర్ కు సమస్యను వివరించారు. సంబంధిత అధికారులు రెండు రోజుల్లో పునరుద్ధరిస్తామని హామీఇచ్చారు. కాలనీ వాసులు, మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల సందీప్‌లకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



# పనిమంతుడు గొట్టిముక్కుల సదానందం



**ఆయన జీవితం ఆదర్శప్రాయం**

**వృత్తిరీత్యా.. వ్యక్తిగతంగా ఆయనకు ఆయనే సాటి**

**స్వయంకృషితో ఎదిగిన వైనం..**

**సేవలకు గుర్తింపుగా వరించిన పురస్కారాలు**

**పేదల పక్షపాతిగా గుర్తింపు**

*మన కలలు ఒకలా ఉంటాయి. సృష్టికర్త స్క్రీన్ ప్లే ఇంకోలా ఉంటుంది. జీవితంలో మెకానికల్ ఇంజినీర్ గా స్థిరపడాలని కలలు కన్నారు. కానీ, ప్రతి అడుగు ఆయనకు కష్టమైంది. జీవితంలో ఎన్నో ఎత్తు పల్లాలు చవిచూసి.. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో తహసీల్దార్ గా పనిచేస్తూ ప్రజలతో ఆత్మీయ అనుబంధం పెంచుకున్న గొట్టిముక్కుల సదానందం జీవితమే అందుకు ఉదాహరణ. గతంలో ఆయన ఇంట్లో వారెవరు ప్రభుత్వ ఉద్యోగాలు చేయలేదు. అందుకే సదానందం చదువుపై మక్కువ పెంచుకొని కష్టపడి చదువుకున్నారు. వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈవినింగ్ కోర్సులో చేరి డిప్లమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్ (డీఎంఈ) పూర్తి చేశారు. తరువాత ఆయనకు అటవీ శాఖలో స్టెనోగ్రాఫర్ ఉద్యోగం లభించింది. ఓ వైపు ఉద్యోగం చేస్తుండగానే 1987లో అనంతపూర్ జేఎన్టీయూలో ఆయనకు బీటెక్ మెకానికల్ సీట్ వచ్చింది. ఉద్యోగ పరంగా సెలవులు లభించలేదు. ఏం చేయాలో తెలియని డోలాయమాన పరిస్థితిలో ఇంజినీరింగ్ సీటును వదులుకున్నారు. జీవితంలో బీటెక్ చేయాలన్న సంకల్పం ఉన్నప్పటికీ, ఆ జీవిత స్వప్నం నెరవేరలేదు. అయినప్పటికీ 1989లో సదానందం రెవిన్యూ శాఖకు బదిలీపై వచ్చి అంచెలంచెలుగా తహసీల్దార్ స్థాయికి ఎదిగి ఉద్యోగాన్ని సుస్థిరం చేసుకున్నారు. ప్రస్తుతం ములుగు జిల్లా వెంకటాపూర్ మండల తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న గొట్టిముక్కుల సదానందం జీవితం ఆద్యంతం ఆసక్తిదాయకం.*

## బాల్యం.. విద్యభ్యాసం

గొట్టిముక్కుల సదానందం 1963 డిసెంబర్ 11న నాటి వరంగల్ నేటి హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో గొట్టిముక్కుల మల్లికాంబ-సమ్మయ్య దంపతులకు జన్మించారు. 1969లో వీరి తండ్రి జీవనోపాధి కోసం వరంగల్ వచ్చి అజంజాహీ మిల్స్ లో గుమస్తాగా చేరారు. వీరు వరంగల్ కాశిబుగ్గలో నివాసం ఏర్పరచుకున్నారు. 1979లో సదానందం గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పాసయ్యారు. సీకేఎం కళాశాలలో ఆచార్యులుగా కే .జయశంకర్, పి.వరవరరావు పని చేసిన కాలంలో ఈయన అక్కడే ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేశారు. 1981-1984 మధ్యకాలంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో (సాయం కాల కోర్స్) మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుతో పాటు ఇంగ్లీష్ టైప్ రైటింగ్ హైయర్ లో ఉత్తీర్ణుడయ్యారు. ఆయన మొదటి ప్రయత్నంలోనే షార్ట్ హ్యాండ్ (ఇంగ్లీష్) లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణత సాధించి రికార్డు నెలకొల్పారు. 1985 ఏప్రిల్ 24న పరకాల మండలం రాయపర్తి గ్రామానికి చెందిన గజ్జల లక్ష్మి-చంద్రమౌళి దంపతుల ప్రథమ పుత్రిక అరుణను వివాహం చేసుకున్నారు. వీరికి కూతురు దివ్య, కుమారులు దినేష్, శశాంక్ లు ఉన్నారు. ఉన్నత చదువులపై ఉన్న మక్కువతో సదానందం ఓవైపు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే మరోవైపు బీఏ., ఎల్ఎల్ బీ పూర్తి చేశారు.

## ఉద్యోగ ప్రస్థానం..

గొట్టిముక్కుల సదానందం 1987లో డీఎస్సీ ద్వారా అటవీ శాఖలో జూనియర్ స్టెనోగ్రాఫర్ గా నియామకమయ్యారు. వరంగల్ జిల్లా అటవీ సంక్షేమాధికారి (దక్షిణ మండలం) వద్ద స్టెనోగా మొదట విధులు నిర్వర్తించారు. 1989లో ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ నుంచి రెవెన్యూ శాఖకు బదిలీపై వచ్చారు. 1989 నుంచి 1991 వరకు వరంగల్ జిల్లా రెవెన్యూ కార్యాలయంలో క్యాంప్ క్లర్క్ గా విధులు నిర్వహించారు. 1991 నుంచి 1998 వరకు జిల్లా జాయింట్ కలెక్టర్లు గా పని చేసిన కుసుమ అంబరీష్, అజయ్ మిశ్రా, శాలిని మిశ్రా, దేవవ్రత కంఠ, జీఎస్ కే గాంధీల వద్ద సీసీగా సేవలందించారు. 1999 నుంచి 2001 వరకు మహబూబాబాద్ మండల రెవెన్యూ ఇన్స్ స్పెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తించారు. 2001 నుంచి 2009 వరకు వరంగల్ జిల్లా జాయింట్ కలెక్టర్ గా పని చేసిన కే .రామ్ గోపాల్, కె. దేవానంద్, చిట్ల పార్థసారథి, సయ్యద్ ఓమర్ జలీల్, ఎన్.కృష్ణ, కేఎస్ శ్రీనివాస్ రాజు, వాకాటి కరుణల వద్ద సీసీగా విధులు నిర్వర్తించారు. 2010 నుంచి 2014 వరకు వరంగల్ ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేశారు. 2014 నుంచి 2016 వరకు ములుగు ఆర్డీఓ కార్యాలయంలో భూ సేకరణ విభాగంలో డీటీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2016-2017 మధ్యకాలంలో భూపాలపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహించారు. 2017లో తహసీల్దార్ గా పదోన్నతి పొంది వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో సూపరిండెండెంట్ గా పనిచేశారు. 2018 నుంచి 2019 వరకు చెన్నారావుపేట మండల తహసీల్దారుగా సేవలందించారు. 2019 నుంచి 2024 వరకు వరంగల్ కలెక్టరేట్ లో వివిధ సెక్షన్లలో సూపరిండెండెంట్ గా పనిచేశారు. 2024 మార్చి ఒకటి నుంచి ములుగు జిల్లా వెంకటాపూర్ మండల తహసీల్దార్ గా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

## కుటుంబ బాధ్యతల్లో ఆదర్శం..

వీరి పెద్దబ్బాయి గొట్టిముక్కుల దినేష్ బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి 2017లో ఇండియన్ సివిల్ అకౌంట్స్ సర్వీస్ కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ అకౌంట్స్ గా పని చేస్తున్నారు. చిన్నబ్బాయి శశాంక్ తమిళనాడులోని కంచి యూనివర్సిటీ నుంచి బీటెక్ (ఈసీఈ) పట్టా పొందారు. బెంగళూరు ఈక్వాయిలో ఎంబీఏ(ఫైనాన్స్) పూర్తి చేసి బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ నందు మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్నారు. కూతురు దివ్య ఎంఫార్మసీ పూర్తి చేసి ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ స్వర్గం జయప్రకాష్ ను వివాహం చేసుకున్నారు. వీరు ప్రస్తుతం పరకాలలో సుశ్రుత హాస్పిటల్ నిర్మాణం చేసుకొని దాని నిర్వహణ బాధ్యతలు చూసుకుంటున్నారు. ప్రస్తుతం గొట్టిముక్కుల సదానందం ఆయన సతీమణి అరుణ , కొడుకులు, కోడళ్ళు, మనుమలతో హాయిగా జీవితం కొనసాగిస్తున్నారు. వీరికి ఎలాంటి సమస్యలు లేవు.

## వరించిన ఎన్నో పురస్కారాలు..

రెవెన్యూ శాఖలో గొట్టిముక్కుల సదానందం సేవలకు గాను ఆయనను ఎన్నో పురస్కారాలు వరించాయి. జాయింట్ కలెక్టర్ క్యాంప్ క్లర్క్ గా 1994, 1996, 2004, 2006, 2008లో ఉత్తమ ప్రశంసాపత్రాలు పొందారు. ఉత్తమ మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ గా మహబూబాబాద్ లో పనిచేసినప్పుడు అప్పటి రాష్ట్ర మంత్రి పొన్నాల లక్ష్మయ్య చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. 2014లో ఉత్తమ డిప్యూటీ తహసీల్దార్ గా అప్పటి కలెక్టర్ వాకాటి కరుణతో, 2018లో ఉత్తమ తహసీల్దార్ గా అప్పటి కలెక్టర్ ఎం.హరిత ద్వారా పురస్కారాలు స్వీకరించారు.అలాగే 2020లో కూడా వరంగల్ కలెక్టర్ నుంచి ప్రశంసపత్రం పొందారు. 2024 ఆగస్టు 15న స్వచ్ఛదనం-పచ్చదనం పథకం కింద రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) చేతుల మీదుగా ఉత్తమ స్పెషల్ ఆఫీసర్ (పాలంపేట గ్రామ పంచాయతీ) అవార్డును స్వీకరించారు. సమాజానికి, ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తూ ఉన్నతాధికారులతో గొట్టిముక్కుల శభాష్ అనిపించుకుంటున్నారు.



## జనం మేలు కోరే వ్యక్తిత్వం..

నైపుణ్యం ఉన్నచోట వివక్షకు చోటుండదంటారు తహసీల్దార్ గొట్టిముక్కుల సదానందం. అందరికీ అన్ని స్థాయిల్లోనూ సవాళ్లు ఎదురవుతాయి. భయం వీడితే పరిష్కారం అదే దొరుకుతుంది. లక్ష్యాన్ని చేరుకోవాలంటే క్రమం తప్పకుండా ప్రయత్నం చేయాలంటారు. చేయాలనే తపన, ఓపిక ఉంటే ఏమైనా సాధించవచ్చని నిరూపించారు. పల్లెల్లో పుట్టిన సదానందం నిరంతరం జనం మేలు కోసమే పని చేస్తున్నారు. ఎనీ డ్యూటీ.. వి డూ ఇట్ అంటారాయన.



- గడ్డం కేశవమూర్తి





















# టీఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా వల్లకాటి రాజ్ కుమార్

## 13401 ఓట్ల మెజారిటీతో ఘన విజయం

## పలువురు ప్రముఖుల హర్షం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా వల్లకాటి రాజ్ కుమార్ ఘన విజయం సాధించారు. దేశంలోనే తొలిసారిగా ప్రత్యక్ష పద్ధతిలో జరిగిన ఈ ఎన్నికల్లో సమీప ప్రత్యర్థి బూర మల్లేశాన్ని ఆయన ఓడించారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో మొత్తం 48,381 ఓట్లకు గాను, 27 వేల 154 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజ్ కుమార్ కు 20,197 ఓట్లు రాగా మల్లేశంకు కేవలం 6796 ఓట్లు మాత్రమే వచ్చాయి. 161 ఓట్లు చెల్లలేదు. దీంతో వల్లకాటి రాజ్ కుమార్ 13401 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్నిక నామినేటెడ్ పద్ధతిలో కాకుండా ప్రజాస్వామ్యయుతంగా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా జరగడం ఇదే మొదటిసారి. టీఆర్ పీఎస్ అధ్యక్షుడిగా వల్లకాటి రాజ్ కుమార్ విజయం సాధించడం పట్ల అఖిల భారత పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం, రాష్ట్ర ఇంచార్జ్ వేముల బాలరాజు, అప్పం శ్రీనివాసరావు, రాపోల్ వీర మోహన్, మచ్చ శ్రీనివాస రావు, డాక్టర్ మార్త రమేష్, గంజి శ్రీనివాస్, వరంగల్, హనుమకొండ జిల్లా ల పద్మశాలి సంఘం అధ్యక్షులు బాల్నే శరత్, చందా మల్లయ్య, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు బాసాని చంద్రప్రకాష్, ముఖ్య నేతలు దుస్స శివశంకర్, బింగి సురేష్, కందగట్ల రవి, బిట్ల రవీందర్, సామల శ్రీనివాస్, సామల మధుసూదన్, మామిడాల అశోక్, మామిడి శంకర్ లింగం, బాసాని లక్ష్మీనారాయణ, సదాశివుడు, రమేష్, జలంధర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన వల్లకాటి రాజ్ కుమార్ తమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యక్ష పద్ధతిలో పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన పద్మశాలి కులస్తులకు ఆర్థిక, రాజకీయ పరమైన ప్రయోజనాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వల్లకాటి రాజ్ కుమార్ అన్నారు. పద్మశాలీల ఐక్యత, సంఘటితం కోసం కృషి చేస్తానని తెలిపారు.

# కొత్త కొండలో అఘోర రుద్ర పాశుపత హోమం



**వరంగల్ వాయిస్, కొత్త కొండ :** కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానంలో శ్రీ స్వామివారికి అత్యంత ప్రీతికరమైన శ్రావణ మాసం మంగళవారాన్ని పురస్కరించుకొని శ్రీ వీరభద్ర నక్షత్ర దీక్షల సందర్భంగా అఘోర రుద్ర పాశుపత హోమాన్ని వేదోత్తములైన ఆలయ అర్చకులచే అత్యంత వైభవముగా నిర్వహించారు. ఈ అఘోర పాశుపత రుద్ర హోమానికి విశిష్ట అతిథిగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజరూప దర్శనంలో కొలువై ఉన్న స్వామి వారికి ఆలయ అర్చకులు తొలుత గణపతి పూజతో ప్రారంభించి వర్ధిని శివకుంభంలో ఆవాహన చేసి ఆవరణ దేవతార్చన, కుంభ సంస్కారం, లక్ష్మి గణపతి హోమం, మూల మంత్రాలు ఆవరణ హోమాలు అనంతరం అఘోర పాశుపత రుద్ర హోమం, పంచసూక్త హోమాలు నిర్వహించి మహా పూర్ణాహుతి, అగ్ని ఉద్వాసన నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారికి కుంబాభిషేకం, బిల్వపత్రంలచే లక్ష బిల్వార్చన స్వామివారికి మహా మంగళహారతి నిర్వహించారు. హోమం పూర్తయిన అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ మహదాశీర్వచనం చేశారు. అఘోర పాశుపత రుద్ర హోమం నిర్వహించడం వలన లోక కళ్యాణం జరిగి సకాలంలో వర్షములతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, సస్యరక్షణ జరుగుతుందని, హోమంలో పాల్గొన్న వారికి సమస్త బాధలు తొలగి సుఖ సంతోషములు సంప్రాప్తిస్తాయని పురాణాల్లో చెప్పినట్లు అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కిషన్ రావు, ఉప ప్రధానార్చకులు కే.రాజయ్య, ముఖ్య అర్చకులు రాంబాబు, అర్చకులు శ్రీకాంత్, రమేష్, వినయ్, శర్మ, సందీప్ కుమార్, వీరభద్రయ్య, శరత్ చంద్ర, శివకుమార్, శ్రావణ్, గురు ప్రసాద్, సిబ్బంది రవీందర్, నారాయణరావు, రాజేందర్, భిక్షపతి, రాజు, నక్షత్ర దీక్షా స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## మంత్రి జూపల్లి కృష్ణారావు

## రూ.12.15కోట్లతో కొడవటంచ ఆలయ అభివృద్ధి శంకుస్థాపన

## భూపాలపల్లిలో మంత్రుల పర్యటన సక్సెస్



**వరంగల్ వాయిస్, రేగొండ/గోరికొత్తపల్లి/గణపురం/ములుగు :** భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, భూపాలపల్లి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డిల పర్యటన సక్సెస్ అయింది. ముందుగా రేగొండ మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి వారిని మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు, నాయకులు మంత్రికి పూర్ణకుంభం, మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ అధికారులు మంత్రికి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం రూ.12.15కోట్లతో చేపట్టనున్న కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులకు మంత్రి టెంకాయ కొట్టి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు భక్తుల సౌకర్యాలను మెరుగుపరుస్తామని మంత్రి అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భక్తుల కోసం వసతి సదుపాయాలు కల్పిస్తామని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు త్వరితగతిన అందించాలని అధికారులను మంత్రిని ఆదేశించారు. చివరగా ఎన్ఎస్ఆర్ సంస్థల అధినేత సంపత్ రావు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి చిత్ర పటాన్ని మంత్రులకు అందజేశారు. అనంతరం కొడవటంచ నుంచి రేగొండ, జగ్గయ్యపేట గ్రామం మీదుగా శ్రీ బుగులోని వెంకటేశ్వరస్వామి గుట్టకు చేరుకుని అక్కడ గుట్టలను పరిశీలించారు. అనంతరం పాండవుల గుట్టకి చేరుకుని అక్కడ ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో మంత్రి పాల్గొని మొక్కను నాటారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ.. అజ్ఞాత వాసం చేసిన చారిత్రాత్మకత కలిగిన ప్రాంతం పాండవుల గుట్టలని, ఆదిమ మానవులు వేసిన చిత్రాలు నేటికీ ఈ గుహలో ఉన్నాయని, ఇది ఒక అద్భుతమైన పర్యాటక ప్రాంతమన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సుమారు రూ.8 కోట్లతో పాండవుల గుట్టలను అభివృద్ధి చేయాలని మంత్రిని కోరగా, త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దేశం నలుమూలల నుంచి పర్యాటకులను ఆకర్షించే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టవలసి ఉందని మంత్రి అన్నారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి పర్యాటకులకు శాశ్వత, తాత్కాలిక మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రోప్ వే, ట్రెక్కింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖల మంత్రులు ద్వారా రహదారి కనెక్టివిటీ కూడా ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఇక్కడికి పర్యాటకులు రావడానికి అన్ని రోడ్లను డెవలప్ చేసేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం గణపురం మండలం మైలారం గ్రామంలో పర్యాటక శాఖ వారు ఏర్పాటు చేసిన సున్నపు గుహల ఛాయా చిత్రాలను మంత్రి పరిశీలించారు. అక్కడి నుంచి గణపురం మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువు చేరుకొని కట్టపై పరిశీలించారు. చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని మంత్రి సంబంధిత అధికారులను కోరారు. అక్కడినుంచి కోటగుళ్లకు చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మంత్రులు ములుగు జిల్లా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. మంత్రుల పర్యటనను సక్సెస్ చేసిన ప్రతీ ఒక్కరికీ ఎమ్మెల్యే పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



### రామప్పను సందర్శించిన మంత్రి..

మంగళవారం వెంకటపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శఆక మంత్రి సీతక్క తో కలసి పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, భూపాలపల్లి, వర్ధన్నపేట, ఎమ్మెల్యేలు సత్యనారాయణరావు, నాగరాజు, పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ షభరిష్, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ కె.సత్య పాల్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు, జిల్లా, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com